క్లుప్తంగా

తాడికొండ సచివాలయంలో దొంగతనం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామ సచివాలయం వద్ద వీఆర్‌వో పుష్పలత హ్యాండ్‌బ్యాగ్ దొంగతనం జరిగింది. బాధిత వీఆర్‌వో తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి ఎంపీడీవో తదితర అధికారులు గురువారం రావడంతో సచివాలయం వద్ద తన హ్యాండ్‌బ్యాగ్ ఉంచి, గ్రామంలోకి వెళ్లానని ఆ తర్వాత వచ్చి చూసేసరికి అక్కడ తన బ్యాగు లేదన్నారు. తోటి ఉద్యోగులను అడిగితే తమకు తెలియదన్నారని, ఆ బ్యాగులో రూ.3 వేల నగదు, బంగారం చైన్ బిల్ల, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఏటీఎం కార్డు ఉన్నాయన్నారు. ఇదే ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మక్కువ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూతన వ్యవస్థ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని విద్యార్థులకు వివరించారు. పీడిత ప్రజలు, స్త్రీల విద్యాభివద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరికష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మక్కువ: అడవులను సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశాఖపట్నం సర్కిల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని సాలూరు రేంజ్ మక్కువ సెక్షన్ దుగ్గేరు బీట్ పరిధి మూలవలస గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులలో నిప్పు పెట్టడం వల్ల ప్రకృతి నాశనమవుతుందన్నారు. అడవులలో గంజాయి సాగు చట్టరీత్యా నేరమని, గంజాయిసాగు చేసిన వారికి జైలు శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. గంజాయికి బానిస కావడం వల్ల జీవితాలు కోల్పోతారని, గంజాయికి దూరంగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మక్కువ అటవీ సెక్షన్ అధికారి కేతిరెడ్డి. నారాయణరావు, బీట్ ఆఫీసర్లు గణపతి, సతీష్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు

పార్వతీపురంటౌన్: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో సంకల్పం పథకం ద్వారా ఔత్సాహిక పారిశ్రామి వేత్తల అవగాహన సదస్సు మొదటి రోజు డోకిశీల సచివాలయంలో జిల్లా పరిశ్రమల శాఖాధికారి కరుణాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామస్తులు వ్యాపార అవకాశాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో 30 మంది యువతీయువకులకు అవగాహన కల్పించారు. పరిశ్రమల శాఖ ద్వారా కల్పించే అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి కె.సాయికృష్ణ చైతన్య పాలొన్నారు.

స్కిల్ డవలప్‌మెంట్‌పై శిక్షణ ప్రారంభం

బలిజిపేట: చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న మహిళా సంఘాల సభ్యులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వెలుగు శిక్షణ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి కె. సాయికృష్ణ చైతన్య శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరంలో కొత్తగా రుణాలు పొందాలనుకునే వారు వారు చేపట్టాల్సిన, చేపడుతున్న వ్యాపారాల అభివృద్ధిని కొనసాగించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా తయారవాలనే ఉద్దేశంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వారికి తగు సూచనలు అందించనున్నట్లు తెలిపారు. వ్యాపారాన్ని నిర్వహించేందుకు అవసరమైన పెట్టుబడి ఒక రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు కొత్త రుణాలను ప్రభుత్వం ఇవ్వనుందని తెలిపారు. వాటితో ఎటువంటి వ్యాపారాలను నిర్వహించాలి, వాటికి అవసరమైన ప్రణాళికలు ఏ విధంగా సిద్ధం చేసుకోవాలనే దానిపై శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు.

వెంటాడుతున్న ప్రయాణ కష్టాలు



- నిలిచిపోయిన ఆర్టీసీ సేవలు
- పార్వతీపురానికి నైట్‌హాల్ట్ కట్
- వీరఘట్టం – శ్రీకాకుళం ఫస్ట్ బస్ కట్
- రద్దయిన విశాఖపట్నం,పొల్ల సర్వీసులు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

వీరఘట్టం: మండల ప్రజలకు ప్రయాణ కష్టాలు వెంటాడుతున్నాయి. అవసరమైన ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక నిత్యం వ్యాపారులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. పార్వతీపురం నుంచి రాత్రి 9 గంటలు దాటిన తర్వాత వీరఘట్టంకు బస్సు సర్వీసులు లేవు. అలాగే వీరఘట్టం నుంచి ఉదయం 6 గంటల వరకు పార్వతీపురం వెళ్లేందుకు బస్సులు లేవు. పార్వతీపురం నుంచి వీరఘట్టం వచ్చే నైట్‌హాల్ట్ బస్సును కూడా రద్దు చేశారు. అలాగే వీరఘట్టం నుంచి పొల్ల, నీలకంఠాపురం వెళ్లే బస్సు సర్వీసును.. వీరఘట్టం నుంచి ఉదయం 5 గంటలకు విశాఖపట్నం వెళ్లే బస్సు సర్వీసు కూడా ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. ఇలా వీరఘట్టం రావడానికి, ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే పలు ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దు చేయడంతో మండల ప్రజలను ప్రయాణ కష్టాలు వెంటాడుతున్నాయి. వీరఘట్టం మండల కేంద్రం సీతంపేట, వంగర, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండంలోని కొన్ని గ్రామాలకు వ్యాపార కేంద్రంగా ఉంది. అందుచే నిత్యం ఈ ప్రాంతాలకు చెందిన ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు వీరఘట్టం వస్తుంటారు. అయితే వీరు వచ్చేందుకు ఆర్టీసీ బస్సులు ఈ ప్రాంతాల్లో లేకపోవడంతో ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో వస్తూ ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రూట్‌లలో నిత్యం ఆర్టీసీ బస్సులు తిరిగేవి. కాలక్రమేణా ఈ రూట్‌లలో తగినంత ఆదాయం రావడం లేదని ఆర్టీసీ అధికారులు బస్సులు నిలిపివేశారు.

ఇదీ పరిస్థితి..

మారుమూల గ్రామాలకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నప్పటికీ వీరఘట్టం మండల కేంద్రం నుంచి మాత్రం పలు రూట్ బస్సులను రద్దు చేశారు. సుమారు 18 వేల మంది జనాభా ఉన్న వీరఘట్టం మేజరు పంచాయతీలో నిత్యం 500 మంది ఉదయం తెల్లవారుజామునే ఉద్యోగం, వ్యాపారం, చదువు, వైద్యం నిమిత్తం పార్వతీపురం, శ్రీకాకుళం, పాలకొండ, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే ఉదయం 6 గంటల వరకు ఆర్టీసీ పాసింజర్ సర్వీసులు లేవు. దీంతో తెల్లవారుజామున వెళ్లాల్సిన వారు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణాలు చేస్తున్నారు. నైట్‌హాల్ట్ సర్వీసులు లేకపోవడంతో రాత్రిపూట వీరఘట్టం రావాలన్నా ఇబ్బంది తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

రద్దయిన బస్సు సర్వీస్‌లు ఇవే..

వీరఘట్టం మీదగా పొల్ల వెళ్లే బస్సు చాలా రోజుల కిందట రద్దు చేశారు. దీంతో వీరఘట్టం, సీతంపేట మండలాల్లో ఉన్న 30 గ్రామాల గిరిజనులు నిత్యం అవస్థలు పడుతున్నారు. అలాగే వీరఘట్టం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సు సర్వీసును ఏడాది కిందట రద్దు చేశారు. దీంతో ఈ ప్రాంతాల నుంచి వీరఘట్టం వచ్చే విద్యార్థులు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. అలాగే పార్వతీపురం నుంచి వచ్చే నైట్‌హాల్ట్ బస్సు రద్దు చేయడంతో రాత్రి 9 గంటల తర్వాత పార్వతీపురం నుంచి వీరఘట్టం రావాలంటే నరకయాతన పడాల్సిందే. గతంలో వీరఘట్టం – శ్రీకాకుళం నైట్‌హాల్ట్ ఉండేది. ఈ సర్వీసుతో అటు వ్యాపారులకు, ఇటు విద్యార్థులకు.. అలాగే వీరఘట్టంనకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు కూడా ఈ సర్వీసు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఈ సర్వీస్‌ను కూడా రద్దు చేశారు.

రాత్రి 9 దాటితే నరకమే..



విశాఖపట్టణం వెళ్లిన వారు రాత్రి 9 గంటల తర్వాత పార్వతీపురంలో దిగుతున్నారు.అయితే పార్వతీపురం నుంచి వీరఘట్టానికి రాత్రి 9 గంటల తర్వాత నైట్‌హాల్ట్ సర్వీసు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తెల్లవారుజాము 5 గంటలకు పార్వతీపురం వెళ్దామన్నా బస్సులుండడం లేదు. – భోగి మణి, మెడికల్ షాపు యజమాని, వీరఘట్టం

విశాఖపట్నం బస్సు పునరుద్ధరించాలి..



వీరఘట్టం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సును ఏడాది కిందట రద్దు చేశారు. దీని వల్ల నిత్యం వందలాది మంది విద్యార్థులు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. దూరప్రాంతాల నుంచి వీరఘట్టం మీదుగా విశాఖపట్నం వెళ్లాల్సిన వారు బస్సులేక నరకయాతన పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విశాఖపట్నం బస్సును నడపాలి.
– పన్నింటి శ్రీనివాసరావు, వీరఘట్టం

ఇబ్బంది పడుతున్నారు..



పొల్ల, దోనుబాయి, నీలకంఠాపురం, మానాపురం, తదితర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది గిరిజనులు వీరఘట్టం వస్తున్నారు. అయితే ఈ రూట్‌లో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాల్లో వస్తూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం అని చెబుతున్న అధికారులు సర్వీస్‌లు ఎందుకు రద్దు చేస్తున్నారో అర్థం కావడం లేదు.
– జలుమూరు అమర్‌నాథ్, వీరఘట్టం

కొత్త బస్సులున్నా వేయడం లేదు..

ఇటీవల పాలకొండ, పార్వతీపురం ఆర్టీసీ డిపోలకు కొత్త బస్సులు వస్తున్నాయని చెబుతున్న డిపో మేనేజర్లు వీరఘట్టం రూట్ వైపు కన్నెత్తి చూడడం లేదు. కొత్త బస్సులు వేసి ఒక ప్రణాళిక ప్రకారం ఈ రూట్‌లో బస్సులు నడిపితే అధిక ఆదాయం వస్తుంది.

● నివాళులు..



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం. శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో పూలే విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు సాధికారత చదువు ద్వారా సాధ్యమవుతుందని చెప్పిన ధీశాలి అని కొనియాడారు. కార్యక్రమంలో సావిత్రిబాయ్ పూలే అవార్డు గ్రహీత లిల్లీరాణి, వైస్ ప్రిన్సిపాల్ బి. జయమణి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే భామిని మండలం కాట్రగడ-బి ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.సుభీలా, సిబ్బంది పాల్గొన్నారు. – పాలకొండ/భామిని

పరామర్శ



మండలంలోని పరజపాడు గ్రామంలో బొబ్బిలి అనంతనాయుడు అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణిలు శుక్రవారం ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. వారి వెంట నాయకులు లోలుగు నారాయణరావు, పోల గోవిందనాయుడు ఉన్నారు. – జియ్యమ్మవలస

సందర్శన..



భామిని మండల కేంద్రంలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలను ఎంపీడీఓ గుండేలా చంద్రరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. భోజనాలు, బోధనాంశాలపై ఆరా తీశారు. – భామిని

వాహన తనిఖీలు



వాహన ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎస్‌ఐ అనీష్

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. హెల్మెట్ ధరించని పలువురు వాహనదారులకు అపరాద రుసుం విధించారు. రోడ్లపైకి వాహనాలతో వచ్చేటప్పుడు లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు.

చిన్నారిపై విధి కన్నెర్ర


- మెదడు సంబంధిత వ్యాధితో 9 నెలలకే మృతి
- దాతలు సాయం చేసినా దక్కని ఫలితం



లక్ష్యతాశ్రీ (ఫైల్)

వీరఘట్టం: తల్లి గర్భంలో 9 నెలల పాటు ఆనందంగా గడిపిన ఆ చిన్నారిపై బాహ్య ప్రపంచంలోకి వచ్చిన 9 నెలలకే విధి పగబట్టింది. అంతుచిక్కని వ్యాధితో అందనిలోకాలకు తీసుకుపోయింది. తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చింది. వీరఘట్టం మండలం అడారు గ్రామానికి చెందిన వండాన సంతోష్‌కుమార్, హేమలత దంపతుల ముద్దులపట్టి లక్ష్యతాశ్రీకి తొమ్మిది నెలల వయస్సులోనే మెదడు సంబంధిత వ్యాధి సోకింది. మెదడులో అంతుచిక్కని కణతులను తొలగించేందుకు వైద్యులు సాహసించలేకపోయారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం చిన్నారి మృతి చెందింది. ఇంతవరకు సంతోషకుమార్ మిత్రులు కూడా పాప వైద్యం కోసం కొంత ఆర్థిక సాయం చేశారు. మరింత సాయం అందించేందుకు సిద్ధపడినా ఫలితం లేకపోయింది. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పనిసరి అని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో కొత్తగా ప్రారంభించిన కుటుంబ్ ఐవీఎఫ్-ఫెర్టిలిటీ క్లినిక్‌ను శుక్రవారం ఆయన వైద్యబృందంతో కలిసి తనిఖీ చేశారు. ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రమాణాలు, చెక్ లిస్ట్ ప్రకారం ఉండాల్సిన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల నిర్వహణ తీరు పరిశీలించారు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవసరమైన అర్హత పత్రాలు, సర్టిఫికెట్లు, డాక్యుమెంట్స్ తనిఖీ చేశారు. క్లినిక్‌లో తనిఖీలకు అవసరమైన పరికరాల లభ్యత, రికార్డుల నిర్వహణ పరిశీలించారు. బయోమెడికల్ వ్యర్థ నిర్వహణ ఏర్పాట్లు, టాయిలెట్ల నిర్వహణ పరిశీలించి ఆరోగ్య అంశాలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ప్రదర్శించాలని సూచించారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య పరీక్షలకు వచ్చిన వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ఆస్పత్రి ఆవరణ, పరిశుభ్రత తీరు పరిశీలించారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ వై.వివేక్, వి.సన్యాసిరావు, ఈఓ సత్తిబాబు తదితరులు ఉన్నారు.

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి వైకుంఠరావు

గరుగుబిల్లి: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పంచాయతీ కార్యదర్శి బి.వైకుంఠరావు అన్నారు. మండలంలోని కొంకడివరం గ్రామంలో సర్పంచ్ ఎ.అప్పలనాయుడు ఆధ్వర్యంలో గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి అవసరమైన పలు పనులకు సంబంధించి, సభ్యులు తీర్మానం చేశారు. పారిశుధ్యం, తాగునీటి పనులకు ప్రాధాన్యమివ్వాలని సభ్యులు కోరారు. కాలువలు నిర్మించడంతో పాటు ఎప్పటికప్పుడు మురుగునీల్వలు తొలగించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలి



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: రైతులంతా ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలని ప్రకృతి వ్యవసాయం అసోసియేట్ అన్నపూర్ణ సూచించారు. మండలంలోని లోవలక్ష్మీపురం గ్రామంలో నవధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే నవధాన్యాలు విత్తనాలు వేసుకోవాలని, అనంతరం పంటల మార్పిడి చేస్తూ సాగు చేసుకోవాలన్నారు. ప్రకృతి సాగు పద్ధతులు పాటిస్తూ పంటలు పండిస్తే ఆరోగ్యవంతమైన పంటలతో పాటు అధిక దిగబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎంటీ లంక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై వై.అమ్మన్నరావు అన్నారు. దోనుబాయి కూడలి వద్ద శనివారం వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చాన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ సూచించారు. మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ పీవో కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆమె.. అక్కడి సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, ప్రీస్కూల్ నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గరుగుబిల్లి: రోగులకు వైద్యసేవలు సకాలంలో అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని పార్వతీపురం మన్యం జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన శుక్రవారం సందర్శించారు. అక్కడి సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, ఓపీ, మందుల నిల్వలు, రక్త పరీక్షలు వంటివి పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే గర్భిణులు ప్రసవం జరిగేలా చూడాలన్నారు. విద్యార్థులు, గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి, విటమిన్ మాత్రలు అందించాలన్నారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి వినోద్‌కుమార్, వైద్యాధికారి కె.కె.సాగర్ వర్మ తదితరులు ఉన్నారు.

19వ పాశురం



గోదారంగనాథులకు దీపహారతి ఇస్తున్న భక్తులు

బలిజిపేట: ధనుర్మాసం సందర్భంగా వెంగాపురం రామాలయంలో 19వ పాశురం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గోపాలకృష్ణ, ఫణికుమార్ శర్మ, సూర్యనారాయణల ఆధ్వర్యంలో దీపారాధన చేశారు. కుత్తు విళక్కెరియ (దీపపాశురం)లో స్వామివారి సన్నిధిలో భక్తులు దీపాలను వెలిగించి స్వామివారిని కొలిచారు. ధనుర్మాసంలోని విశేష రోజులలో ఇది ఒకటని, దీనిని ఎంతో గొప్పగా జరుపుకుంటారని అర్చకులు తెలిపారు. తిరుప్పావై ప్రకారం 19వ పాశురం రోజున గోదాదేవి, గోపికలు స్వామివారిని దీపపు కాంతితో ఆరాధిస్తారన్నారు.

గోదా రంగనాథులకు దీపహారతి

సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేట రామాలయంలో గోదా రంగనాథులకు శుక్రవారం దీపహారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



వెంగాపురం రామాలయంలో దీపారాధనలు